నేటి నుంచి గాలి పోచమ్మ ఆలయ వార్షికోత్సవం

గౌలిపురా: గౌలిపురా అంబికానగర్‌లోని గాలి పోచమ్మ ఆలయ పదో వార్షికోత్సవ వేడుకలను ఈనెల 17 నుంచి 20 నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు రాజపాగ అర్జున్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 17న ఉదయం 6 గంటలకు గణపతి పూజ, పుణ్యహవచనం, గౌరిపూజా, సహస్ర ఆరాధన, సర్వతోభద్ర మండల ఆరాధన, 7.30 గంటలకు గాలి పోచమ్మ అమ్మవారికి 9 కలశ అభిషేకం, 9 గంటలకు మహాచండీ హోమం, పూర్ణాహుతి, హారతి, తీర్థ ప్రసాద వితరణ తదితర పూజ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 20న అమ్మవారికి విశేష అభిషేకం, అలంకరణ, బోనాల సమర్పణ ఉంటుందని పేర్కొన్నారు. అమ్మవారికి అభిషేకం చేసేవారు రూ.516, మహాచండీ హోమంలో పాల్గొనే భక్తులు రూ.1116లు చెల్లించాలని తెలిపారు.

శాకాంబరిగా అమ్మవారు



యాకుత్‌పురా: పాతబస్తీ హరిబౌలిలోని చారిత్రాత్మక అక్కన్న మాదన్న మహంకాళి ఆలయ 77వ వార్షిక బోనాల ఉత్సవాల సందర్భంగా అమ్మవారు బుధవారం శాకాంబరి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం అభిషేకం నిర్వహించి వివిధ రకాల కూరగాయలతో అలకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు డీ ప్రభాకర్, కే దత్తత్రేయ, ఏ.సతీశ్ కుమార్, ఎస్‌పీ క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి వరాల మైసమ్మ బోనాలు



జియాగూడ: వేంకటేశ్వర్‌నగర్ వరాల మైసమ్మ ఆలయంలో ఈనెల 19 నుంచి బోనాల ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధి పాలరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం పాతబస్తీ నుంచి అమ్మవారి తొట్టెల ఊరేగింపు పురానాపూల్ మీదుగా ఆలయానికి చేరుకుంటుందని పేర్కొన్నారు. ఆదివారం సామూహిక బోనాల సమర్పణ, మంగళవారం అమ్మవారికి ఫలహారపు బండి, భారీ తొట్టెలు ఊరేగింపుగా ఆలయం నుంచి శీతలామాతా దేవాలయానికి చేరుకుంటుందని పేర్కొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు



బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షిస్తున్న కుల్సుంపురా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య

జియాగూడ: మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని కుల్సుంపురా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య అన్నారు. సీపీ సీవీ ఆనంద్, జాయింట్ సీపీ ట్రాఫిక్ జోయల్ డేవిస్ ఆదేశాల మేరకు మొగల్‌కానాలా, రింగ్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో బుధవారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారులను బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించారు.

గోల్కొండ ఆసుపత్రిలో 'టీబీ ముక్త్ అభియాన్'

గోల్కొండ: గోల్కొండ ఏరియాసుపత్రిలో 'టీబీ ముక్త్ అభియాన్'ను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వ్యాధిగ్రస్తులు సమీపంలోని టీబీ కేంద్రం లేదా ఏరియాసుపత్రిలో పేర్లు నమోదు చేసుకుంటే వారి ఇంటి వద్దే మందులు అందిస్తామన్నారు. వైద్యుల సలహాలు, సూచనలు పాటిస్తూ మెడిసిన్ క్రమం తప్పకుండా వాడితే వ్యాధి పూర్తిగా నయం అవుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేనేత కళాకారులకు చేయూతనివ్వాలి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెంబర్-12లోని కళింగ కల్చరల్ హాల్‌లో ఏర్పాటైన జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శనను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ప్రచార జాయింట్ కన్వీనర్ రమ్యారావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ఇక్కడి హాల్‌లో కొలువుదీరిన చేనేతకారుల వస్త్ర ఉత్పత్తలను తిలకిస్తూ, చేనేతకారులతో వాటి తయారీ విధానం, ప్రత్యేకత తెలుసుకున్నారు.ఈ ప్రదర్శన ఈ నెల 21వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు జయేష్‌గుప్తా తెలిపారు.

గోషామహల్‌లో బోనాల సందడి

అబిడ్స్/అఫ్జల్‌గంజ్: గోషామహల్‌లో బుధవారం బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఏరియా పరిధిలోని ఏడుగుళ్లు, ఐదుగుళ్లు, మహంకాళి ఆలయం, దుర్గామాత ఆలయం, చందన్‌వాడి అమ్మవారి ఆలయం, హిందీనగర్ అమ్మవారి ఆలయం, బేగంబజార్ అమ్మవారి ఆలయంలో బోనాల సంబరాలు అంబరాన్నంటాయి. అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించి పూజలు చేశారు. రాష్ట్ర బీజేపీ కార్యాలయ ఇన్‌ఛార్జ్ గోపాల్ జీ, బీఆర్‌ఎస్ నాయకులు సురేష్ ముదిరాజ్‌తో పాటు పలువురు నాయకులు పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోషామహల్ ఏసీపీ సుదర్శన్ ఆధ్వర్యంలో గోషామహల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పలు ఆలయాల వద్ద భారీ ఎత్తున పోలీసు బందోబస్తు నిర్వహించారు.

సింహవాహిని అమ్మవారికి..

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారికి ఛత్రినాక పోలీస్‌స్టేషన్ తరపున తొలిసారిగా బుధవారం బోనం సమర్పించారు. ఇన్‌స్పెక్టర్ కే నాగేంద్రప్రసాద్ వర్మ ఆధ్వర్యంలో స్టేషన్ నుంచి డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ గోపాల్ రావు, ఎస్సైలు త్రిమూర్తులు, సీతయ్య, స్వప్న, అఖిల్, ప్రేం కుమార్ స్టేషన్ నుంచి డప్పు చప్పుళ్ల నడుమ బోనాలతో ముందుకు కదిలారు. మహిళా ఎస్సై స్వప్నతో పాటు కానిస్టేబుల్ అమ్మవార్లకు బోనం సమర్పించారు. వీరితో పాటు ఛత్రినాక డివిజన్ ఏసీపీ సీహెచ్.చంద్రశేఖర్, కమిటీ ప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



వేడుకల్లో రాష్ట్ర బీజేపీ కార్యాలయ కో ఆర్డినేటర్ డీ గోపాల్‌జీ



చందన్‌వాడీలో పూజలు చేసిన బీఆర్‌ఎస్ నాయకులు సురేశ్ ముదిరాజ్



గోషామహల్ హిందీనగర్ వద్ద బోనాలతో జాగృతి మహిళలు



మహారాజ్‌గంజ్ అమ్మవారి ఆలయం వద్ద బోనాలతో చిన్నం సమాజ్ మహిళలు

ఎన్టీఆర్, పీవీ నర్సింహారావు జయంతి ఉత్సవాలు



రజనీరెడ్డికి పురస్కారం ఇస్తున్న శాంతికృష్ణ

గన్‌ఫౌండ్రీ: కళాప్రాంగణంలో తెలుగు వెలుగు సాహితీవేదిక, కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఎన్టీఆర్, పీవీ నర్సింహారావు జయంతి ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బతుకమ్మ తల్లి గ్రంథకర్త వంగాల శాంతికృష్ణ ప్రముఖ నవల రచయిత్రి గంట రజనీరెడ్డికి మహానంది జాతీయ విశిష్ట పురస్కారం అందజేశారు. రచయిత్రి రజిని రెడ్డి మాట్లాడుతూ...ఈ పురస్కారం తనపై మరింత బాధ్యతను పెంచిందని, రానున్న రోజుల్లో సమాజ హితానికి రచనలు చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ, తెలుగు వెలుగు సాహితీవేదిక జాతీయ అధ్యక్షుడు కాళోజు రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బోనాలకు రండి



గౌలిపురా: గౌలిపురా నల్ల పోచమ్మ ఆలయంలో నిర్వహించే బోనాల జాతరకు హాజరుకావాలని కోరుతూ ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆదర్ల మహేశ్ కమిటీ సభ్యులతో కలిసి కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డికి బుధవారం ఆహ్వానపత్రాన్ని అందజేశారు. కమిటీ ప్రతినిధులు కే దేవేందర్, పుప్పాల మధుసూదన్ రావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి



కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

యాకుత్‌పురా: పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ సూచించారు. ప్రభుత్వం అందజేసిన కిట్లను కార్పొరేటర్లు, అధికారులతో కలిసి యాకుత్‌పురాలో బుధవారం కార్మికులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తలాబ్ చంచలం, మొఘల్‌పురా, డబీర్‌పురా డివిజన్ల కార్పొరేటర్లు డాక్టర్ సమీనా బేగం, నస్రీన్ సుల్తానా, అలందార్ వాలాజాహి, జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బోనాల బ్రోచర్ ఆవిష్కరణ

గోల్కొండ: బోనాల సందర్భంగా దర్బార్ మైసమ్మ అమ్మవారికి సమర్పించే పట్టు వస్త్రాల బ్రోచర్‌ను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మిత్ర కృష్ణ గుడిమల్కాపూర్‌లోని మహేశ్‌నగర్‌లో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 18న బోనాల ఉత్సవాలు ప్రారంభమవుతాయని మధ్యాహ్నం 12 గంటలకు కేసరి హనుమాన్ ఆలయం నుంచి బయలుదేరి దర్బార్ మైసమ్మ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నామని తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు టీపీసీసీ అధ్యక్షుడు కూడా హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మిత్ర కృష్ణ, విజయ్ ముదిరాజ్, ఉపేందర్ తదితరులు ఉన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మిత్ర కృష్ణ తదితరులు

తెలంగాణ పర్యాటక శాఖ ఎండీ ప్రత్యేక పూజలు



లంగర్‌హౌస్: గోల్కొండ జగదాంబిక అమ్మవారిని తెలంగాణ పర్యాటక శాఖ ఎండీ వల్లూరి క్రాంతి బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆమెకు ఆలయ చైర్మన్ కొండెపూడి చంటిబాబు లంగర్‌హౌస్‌లో స్వాగతం పలికారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. నానల్‌నగర్ టోలిచౌకీ డివిజన్‌లో బుధవారం పర్యటించారు. హకీంపేట్‌లోని బుల్కాపూర్ నాలా, చెక్ డ్యామ్‌ను పరిశీలించారు. బుల్కాపూర్ నాలాలో పూడికతీత, హకీంపేట్ మిలట్రీ ఏరియాలోని చెక్ డ్యామ్‌తో పూడిక తీసి వర్షపు నీరు నిల్వకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, ఎస్‌ఎన్‌డీపీ, బల్దియా అధికారులు ఉన్నారు.

బకాయిలు చెల్లించని షాపుల సీజ్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెంబర్-2లోని కేబీఆర్ పార్కును ఆనుకుని ఉన్న గేటు నెంబర్-2, గేట్ నెంబర్-3లలోని పార్కింగ్ స్థలాల్లో అద్దె చెల్లించకుండా కొనసాగిస్తున్న షాపులను జీహెచ్‌ఎంసీ అధికారులు సీజ్ చేశారు. జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్ డీసీ సమ్మయ్య ఆధ్వర్యంలో సంబంధిత అధికారులు పర్యటించి లీజుదారుడు అద్దె చెల్లించకుండా నోటీసులు ఇచ్చినా స్పందించకుండా పెద్ద మొత్తంలో అద్దె బకాయి పడడంతో వీటిని సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. గేట్ నెంబర్-2లో కాసా డీ లాటి షాపు యజమాని పర్వత్ మస్కతీ రూ.37 లక్షలు బకాయి పడ్డారు. అలాగే గేటు నెంబర్-3 వద్ద చిచ్చాస్‌ను ఆనుకుని సితార రెస్టారెంట్స్ ఏర్పాటు చేసిన షాపు రూ.25 లక్షలు బకాయి పడింది. ఈ మొత్తాన్ని చెల్లించకుండా సదరు లీజుదారులు షాపులను నడిపిస్తుండడంతో వీటిని సీజ్ చేశారు.



నేడు లాల్‌దర్వాజా అమ్మవారికి బంగారు బోనం

చార్మినార్: సప్త మాతృకలకు సప్త బంగారు బోనం కార్యక్రమంలో భాగంగా లాల్‌దర్వాజాలోని సింహవాహిణి అమ్మవారికి భక్తులు గురువారం బంగారు బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని మహంకాళి ఆలయాల అమ్మవార్లకు బంగారు బోనాలను సమర్పిస్తున్నారు. ఇప్పటికే నగరంలోని ఐదు ప్రధాన దేవాలయాలతో పాటు విజయవాడ కనక దుర్గ అమ్మవారికి బంగారు బోనం, పట్టు వస్త్రాలు, ఒడి బియ్యం సమర్పించారు. చివరిగా లాల్‌దర్వాజా అమ్మవారికి సమర్పించే బంగారు బోనంతో ఈ ఏడాది సప్త మాతృకల బంగారు బోనం కార్యక్రమం ముగుస్తుందని కమిటీ చైర్మన్ గోపిశెట్టి రాఘవేందర్ తెలిపారు. పాతబస్తీ అక్కన్న మాదన్న ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం సామూహిక ఊరేగింపుగా లాల్‌దర్వాజాకు తరలివెళ్లనున్నామని పేర్కొన్నారు.

రేపటి నుంచి ధూల్‌పేటలో..

జియాగూడ: ధూల్‌పేట మహంకాళి అమ్మవారి బోనాల జాతర ఈనెల 18 నుంచి నిర్వహించనున్నట్లు మహంకాళి ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ వెంగాల రవీందర్, వైస్ చైర్మన్ దండు ఘనశ్యామ్, ప్రధాన కార్యదర్శి గంప బ్రిజ్‌మోహన్, కోశాధికారి ఏనుగుల మాణిక్ ప్రభు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18న ఘటం ప్రతిష్ఠ ఊరేగింపు ఆలయం నుంచి ప్రారంభమై పురానాపూల్ వరకు తిరిగి ఆలయానికి చేరుకుంటుంది. 19న సాయంత్రం ఊరేగింపు అవంతి టవర్స్, తొట్టెల ఊరేగింపు ఆలయానికి చేరుకుంటుందని, రాత్రి 9 గంటలకు భజన కార్యక్రమం ఉంటుందని 20న అమ్మవారికి బోనాల సమర్పణ, తెల్లవారుజాము నుంచి మొదలవుతుందని, ధూల్‌పేట ఆర్యసమాజ్ వారిచే హోమం, మధ్యాహ్నం సాంస్కృతిక కార్యక్రమాలు, రంగం కార్యక్రమం, పోతరాజు గావు, ఘటం కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. 21న ఉదయం ఘటం సాగనంపుట, మధ్యాహ్నం అన్నదానం ఉంటుందన్నారు. మహంకాళి ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు సీహెచ్, కే సోమశేఖర్, పీ నరేందర్, డీ వెంకట్‌రావు, టీ సతీశ్ సింగ్, సీహెచ్, మహేశ్‌కుమార్, వీ హనుమంత్‌రావు, ఏ దుర్గేశ్‌రావు, డీ చంద్రమోహన్, బీ విశ్వనాథ్, డీ నాగరాజ్, డీ రాకేశ్‌కుమార్, డీ పవన్, జే పాండు, ఏ రాఘవేందర్, డీ సత్యనారాయణ, బీ మనోజ్, వీ వెంకటేశ్వర్ రావు, ఏ వెంకట్‌రావు తదితరులు ఉన్నారు.



ధూల్‌పేట మహంకాళి ఆలయం

20న మహంకాళేశ్వర అమ్మవారికి..

చార్మినార్: చార్మినార్ ఈస్ట్ లోని వేంకటేశ్వర స్వామి ఆలయం తరపున మీరాలం మండి మహంకాళేశ్వర అమ్మవారికి ఈనెల 20న బంగారు బోనం, పట్టు వస్త్రాలు, ఒడి బియ్యం సమర్పించనున్నారు. వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు, అలంకార బ్రహ్మ ఆత్రేయాచార్య ఆధ్వర్యంలో కోట్ల అలీజా, ఎతేబార్ చౌక్, మీర్ చౌక్ పోలీస్ స్టేషన్ రోడ్డు ద్వారా మీరాలం మండి మహంకాళేశ్వర ఆలయం వరకు కొనసాగనున్నది.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



విద్యార్థి నాయకులతో డీన్ ప్రియామనీష్

విజయనగర్‌కాలనీ: పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని ఇండియన్ ఆర్మీ అధికారి కల్నల్ దీప్‌జ్యోతి సక్సై, రవీంద్రభారతి విద్యాసంస్థల డీన్ ప్రియామనీష్ అన్నారు. విజయనగర్‌కాలనీ రవీంద్రభారతి పాఠశాలలో విద్యార్థి నాయకులను ఎంపిక చేసి ప్రమాణ స్వీకారోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్నల్ దీప్‌జ్యోతి సక్సై పాకిస్థాన్‌పై చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విషయాలను విద్యార్థులకు వివరించారు. అలాగే ఎస్‌పీఎల్‌గా ఎంపికైన విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలు అందజేసి ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఠాకూర్ సరిత, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

టోలిచౌకీ రవీంద్రభారతీ పాఠశాలలో..

గోల్కొండ: టోలిచౌకీ రవీంద్రభారతీ పాఠశాలలో విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి నగర క్రైం బ్రాంచ్ ఏసీపీ కె.ఎం.కిరణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నత విద్యనభ్యసించి కుటుంబానికే కాకుండా దేశానికి గర్వకారణంగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయశ్రీ, డీన్ ప్రియామనీశ్ , ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహోన్నతం హిందువుల సంస్కృతి



సమ్మేళనంలో డాక్టర్ భగవంత్‌రావు, దేవర శ్రీనివాస్ తదితరులు

గోల్కొండ: హిందువుల సంస్కృతి, సంప్రదాయాలు మహోన్నతమైనవని గణేశ్ ఉత్సవ సమితి మాజీ అధ్యక్షుడు డాక్టర్ భగవంత్‌రావు అన్నారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ గుడిమల్కాపూర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైమ హిందువులందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ దేవతలతో పాటు ప్రకృతిని పూజించే సాంప్రదాయం కేవలం మన దేశంలోనే ఉందన్నారు. హైదరాబాద్‌లో జరిగే బోనాలు, వినాయక నవరాత్రులు హిందు సోదరుల ప్రత్యేకతలను చాటుతున్నాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవర శ్రీనివాస్, ఆనంద్, మురళీకృష్ణ, ఉమారాణి, రాధాకిషన్‌యాదవ్, అశోక్ కుమార్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

లంగర్‌హౌస్: మరమ్మతుల కారణంగా మెహిదీపట్నం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈనెల 17న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

మెహిదీపట్నం ఓవర్ హెడ్, ఫారుఖీ, శ్రీరామ్‌నగర్ ఫీడర్లు..

రేతిభౌలి, ఫుడ్ వరల్డ్, మిడ్ వే కాలనీ, పుల్లారెడ్డి కళాశాల, సంతోష్‌నగర్, మెహిదీపట్నం, జాన్‌దార్ నగర్, ఆర్‌ఎస్ బ్రదర్స్, చందనా బ్రదర్స్, చెన్నై షాపింగ్ మాల్, అయోధ్యనగర్, మెహిదీపట్నం బస్టాప్, శ్రీరాంనగర్, ఎంఐజీహెచ్, మురాద్‌నగర్ కుంట, ఆసిఫ్‌నగర్ ప్రధాన రహదారి, రెహనుమా డెక్కన్, మిలాన్ టాకీస్, జేబాబాగ్, ఖాజా గుల్షన్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు.

మెహిదీపట్నం కేబుల్, సాయి గార్డెన్, కంపెనీ బాగ్ ఫీడర్లలో..

హిల్‌కాలనీ, వీవీనగర్, ఎల్ఐసీ కాలనీ, ఎంఐజీహెచ్, దిల్‌షాద్‌నగర్, క్రాంతినగర్, అంబా థియేటర్, ఇన్‌కంట్యాక్స్ కాలనీ, రాంమూర్తి కాలనీ, మెహిదీపట్నం బస్ డిపో, అంబ గార్డెన్, గుడిమల్కాపూర్, విజయశ్రీ అపార్ట్‌మెంట్, సాయి గార్డెన్స్, సాయిబాబా ఆలయం పరిసర ప్రాంతాలు, మోతీదర్వాజ, షంగ్రీలా పాఠశాల, అఫ్సర్‌కాలనీ, కంపెనీ బాగ్, అహ్మద్‌కాలనీ, బాగ్దాద్ కాలనీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

శ్రేష్ట ఫౌండేషన్ ద్వారా నిరంతర సేవలు



విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేస్తున్న విక్రమ్ గౌడ్

అబిడ్స్: శ్రేష్ట ఫౌండేషన్ ద్వారా పేద విద్యార్థులకు నిరంతరం సేవలందిస్తానని ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు విక్రమ్ గౌడ్ పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గంలోని పలు పాఠశాలలకు చెందిన పేద విద్యార్థులకు దాదాపు రూ.7 లక్షల ఆర్థిక సాయాన్ని బుధవారం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తన తండ్రి ముఖేష్ గౌడ్ జీవితాంతం గోషామహల్ నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ.. ప్రజలకు అండగా ఉంటానని విక్రమ్‌గౌడ్ పేర్కొన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు.

ఇజాజ్ రెసిడెన్సీలో అగ్నిప్రమాదం

గౌలిపురా: మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో అగ్ని ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మొఘల్‌పురా గోహర్ గుల్షన్ ఫంక్షన్ హాల్ సమీపంలోని ఇజాజ్ రెసిడెన్సీలోని రెండో అంతస్తు ఫ్లాట్ నంబర్ 201లో మంగళవారం అర్ధరాత్రి 12.15 గంటలకు అగ్ని ప్రమాదం జరగగా స్థానికులు గమనించి మొఘల్‌పురా అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది భవనంలోని ఇంట్లో చిక్కుకున్న సయ్యద్ అబ్దుల్ కరీం సాజిద్, అతియా బేగం, ఫర్హీన్‌బేగం, సయ్యద్ ఇమ్రాన్ జాఫర్, మహ్మద్ రిజ్వానుద్దీన్‌ను లీడింగ్ ఫైర్‌మెన్ ఎస్.ఎం.హసన్ ఆధ్వర్యంలో రక్షించారు. ఈ విషయ తెలుసుకున్న చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీ అక్కడికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు.


శాకాంబరి రూపంలో అమ్మవారు



మహంకాళి మాతేశ్వరి...



కోట మైసమ్మ అమ్మవారు...



మీరాలంమండి అమ్మవారు..

గౌలిపురా: గౌలిపురాలోని మహంకాళి మాతేశ్వరి భరతమాత, కోట మైసమ్మ ఆలయాల్లో బోనాల జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం అమ్మవారిని శాకాంబరి రూపంలో ప్రత్యేకంగా అలంకరణ చేసి కమిటీ సాంస్కృతిక శాఖ కార్యదర్శి అల్లి శివచంద్రగిరి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్మనీ కైలాష్ గంగపుత్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ కేఎస్.ఆనంద్ రావు, ముఖ్య సలహాదారులు ఎస్.మల్లేశం గౌడ్, కే జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి అల్లి మధుసూదన్‌గిరి, ఉపాధ్యక్షులు వై.రామకృష్ణ, బీవై.శ్రీకాంత్, ఎస్. రమేష్, అశోక్ గౌడ్ పాల్గొన్నారు.

శాకాంబరిగా బేలా మాతేశ్వరి ముత్యాలమ్మ..

చార్మినార్: బేలా చందులాల్‌లోని మాతేశ్వరి ముత్యాలమ్మ ఆలయంతో పాటు అమ్మవారి విగ్రహాలను బుధవారం వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. భక్తులతో పాటు పలువురు అధికార, అనధికార ప్రముఖులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మీరాలం మండి మహంకాళేశ్వర అమ్మవారు..

మీరాలం మండి మహంకాళేశ్వర ఆలయంలో 50 క్వింటాళ్ల కూరగాయలు, ఆకు కూరలతో అమ్మవారి గర్భగుడితో పాటు విగ్రహం, శివాలయం, శివ లింగాలను బుధవారం అలంకరించారు. అలంకార బ్రహ్మ ఆత్రేయా ఆచార్య ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించామని ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు.